అల్లూరి సీతారామరాజు విశాలాంధ్ర పార్వతీపురం మన్యం
ఆదివారం 31, మార్చి 2024

అరకు వైసీపీలో ఏం జరుగుతుంది..?

మత్స్యలింగం మౌనం వెనక రాజకీయ సమీకరణాలపై అధిష్టానం ఆరా...!

విశాలాంధ్ర-అరకులోయ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మన్యంలో పట్టు నిలుపుకొని, ఈ దఫా ఏవిధంగానైనా నెగ్గుకు రావాలన్న సంకల్పంతో అన్ని పార్టీలు తమ శక్తి యుక్తులను ఉపయోగిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే ప్రణాళికాలు రూపొందించు కుంటున్నాయి. ఇక అల్లూరి జిల్లా అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన విషయానికి వస్తే ఇక్కడ రోజురోజుకు రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ఎవరు ఏపార్టీ తరపున పోటీ చేస్తారో తెలియని సందిగ్ధం నెలకొని ఉంది. ఇక అధికారంలో ఉన్న వైసీపీ పార్టీ విషయానికి వస్తే అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా హుకుంపేట జడ్పిటిసి రేగం మత్స్యలింగం పేరును ప్రకటించింది. 175 సీట్లు గెలుస్తామన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ధైర్యం పై ప్రతి ఒక్కరు శభాష్ అంటున్నప్పటికీ అరకు పార్లమెంట్ పరిధి, అరకు నియోజకవర్గంలో ఆపరిస్థితి ఇక్కడ లేదు. ఇది చూస్తున్న సీనియర్ కార్యకర్తలు నాయకులు సైతం ఆశ్చర్యానికి గురి అవుతున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు చేస్తున్న హడావిడి కూడా వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం చేయకపోవడంతో అరకు నియోజకవర్గ వైసీపీ నాయకులు కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ఏంటబ్బా మా పార్టీ దుస్థితి అని లోలోపల మదన పడుతున్నారు. ఈ నియోజకవర్గంలో వైసీపీలో వర్గ పోరు ఎక్కువఉంది. పైపైకి పొగుడుతారు, లోలోపల గోతులు తీసే నాయకులు ఇక్కడ చాలా ఎక్కువ అని చెప్పవచ్చు. టికెట్ ఆశ వాహులు సైతం పెద్ద ఎత్తున ఉన్న స్థానం ఆంధ్ర రాష్ట్రంలోని మొదటి స్థానం అరకులోయ అని చెప్పక తప్పదు.ఇక్కడ ప్రస్తుతం ఎవరు ఎవరి కి పొంతన లేదు మరి గెలుపు ఎలా సాధ్యమవుతుంది. గతంలో గిరిజన ప్రాంతంలో మెజార్టీ ఇచ్చిన ఘనత అరకులోయ. నియోజక వర్గంలో అయితే ఆ పరిస్థితి ప్రస్తుతంలేదు. దీంతో అధిష్టానం రంగ ప్రవేశం చేసి మరో సర్వే నిర్వహి స్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఏ సమయంలో ఏం జరుగునో ఎవరు చెప్పగలరా అన్నట్లుగా ఈ సర్వేలు సైతం పుకార్లు షికార్లు చేస్తుండడంతో ప్రజలు కూడా ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. అరకు నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉన్నప్పటికీ, ముందుండి నడిపించాల్సిన నాయకుల తీరు చూసి కొందరు అసహ్యించుకుంటున్నారు. ముఖ్యంగా సమన్వయ లోపంతో పార్టీ సతమత మవుతుంది. పార్టీ దృష్టి సారించకపోతే భారీ మూల్యం తప్పదని స్థానికులు నాయకులు కార్యకర్తలు అంటున్నారు. ఇది ఇలా ఉండగా కొందరు పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పార్టీ కేడర్ లేని వ్యక్తికి టిక్కెట్ ఇవ్వడం అలాగే కార్యకర్తలకు సమన్వయం చేసి కలుపుకొని గుణంలేని వ్యక్తి కావడంతో ఈ ప్రభావం అరకు పార్లమెంట్ కూడా నష్టం వాటిల్లే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిస్థితులు అన్నిటినీ క్షుణంగా పరిశీలించిన పార్టీ అధిష్టానం అరకుపైపూర్తి దృష్టి పెట్టింది. భవిష్యత్తులో అరకు రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశాలు మెండుగా కనిపిస్తుంది.

వైకాపాకు అండగా ఉండి మన్యప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం

కొమ్మంగి, ఎర్రబొమ్మల పంచాయితీలలో పర్యటించిన వైకాపా పాడేరు నియోజకవర్గ అభ్యర్థి విశ్వేశ్వరరాజు

విశాలాంధ్ర-చింతపల్లి : వైకాపాకు అండగా ఉండి మన్య ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలోని కొమ్మంగి, ఎర్ర బొమ్మల పంచాయతీలలో శనివారం ఆ చింతపల్లి జడ్పిటిసి పోతురాజు బాలయ్య మండల అధ్యక్షుడు మోరి రవి, ఆ రెండు పంచాయతీల సర్పంచ్లు పాంగి లక్ష్మి, లోతా పండయ్య, మండల కన్వీనర్ గుణబాబులతో కలిసి కొమ్మంగి పంచాయతీలో కొలపరి, గెంజిగెడ్డ, సల్లాయి, బుడబుడగెడ్డ, గందల వీధి, పెదకొండ, ఉరిశింగి కొత్త ఊరు, ఎర్రబొమ్మల పంచాయతీలో బోయల గూడెం, సీతారాంపురం, రోలంగి, గానుగుల, కొండవంచుల, ఎర్రబొమ్మల, గ్రామాలలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ ఆయన వెంట నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ వైకాపా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. వైకాపా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగనన్న చేసిన మంచిని గుర్తించి మరో మారు ఆయననే ముఖ్యమంత్రి చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైకాపాకు అండగా ఉండి అరకు పార్లమెంట్, అరకు, పాడేరు శాసనసభ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తనను గెలిపిస్తే ఎప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గోపినాయిక శారద, సాగిన వెంగళరావు, కొమ్మంగి ఎంపీటీసీ జర్త రూతు, పెదబరడ ఎంపీటీసీ పొట్టిక లోవరాజు, గొంది పాకల ఎంపీటీసీ తాంబేలి మోహన్ రావు, మాజీ ఎంపీపీ వంతల బాబురావు, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, లంబసింగి మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్, సీనియర్ నాయకులు రావుల నూకరాజు, సచివాలయ కన్వీనర్ పాంగి రస్ నాయుడు, పాటుకూరి బెన్నాస్వామి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

నల్ల మద్ది చెట్టు నుంచి జలధార

విశాలాంధ్ర-రంపచోడవరం: పాపికొండల నేషనల్ అటవీ ప్రాంతంలో అద్భుతం శనివారం ఆవిష్కృత మైంది. కింటుకూరు అటవీ ప్రాంతంలోని బేస్ క్యాంపు పరిశీలనకు వెళ్లిన అటవీ అధికారులకు వింత దృశ్యం కనువిందు చేసింది. అడవిలో నల్లమద్ది చెట్టు నుంచి వస్తున్న జలధారా చెట్లను గుర్తించిన అటవీ అధికారులు ఒకింత ఆశ్చర్యంకు లోనైనట్టు పేర్కొన్నారు. చెట్టు నుండి సుమారు 20 లీటర్ల వరకు నీరు రావటం గుర్తించినట్టు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-గరుగుబిల్లి/బెలగాం : గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామంలో శనివారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గరుగుబిల్లి వైద్యాధికారి డాక్టర్ కె.కె సాగర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన రోగులకు అనారోగ్య సమస్యలను అడిగి, అన్ని వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా గర్భిణీలకు హిమోగ్లోబిన్, బిపి, షుగర్ పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్ ఇస్తూ ఆహారంలో తగు జాగ్రతలు తీసుకోవాలని, హిమోగ్లోబిన్ పెరిగిన%శీ%త వరకూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. చెవి, ముక్కు, వైద్యులు, కంటికి సంబందిత తనిఖీలను చెయ్యడం జరిగింది. దీర్ఘకాలిక రోగాలు, 60 ఏళ్ళ పైబడిన వారు, బాలింతలు, చిన్న పిల్లలు వచ్చిన వారికి కావలిసిన వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడం జరిగింది. అలాగే ఆర్.బి.ఎస్.కె అధికారి రఘు శిబిరానికి వచ్చి పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు ఎస్. కోటేశ్వరరావు, సూపర్ వైజర్ చిన్నమ్మ, రవణమ్మ, ఉదయకుమారి, వైద్య సిబ్బంది, 104 దుర్గాప్రసాద్, శివ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో జోనల్ అధికారులు అప్రమత్తంగా వుండాలి

కలెక్టర్ ఎం.విజయ సునీత

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : సార్వత్రిక ఎన్నికలను విజయవతంగా నిర్వహించడానికి సెక్టోరల్ అధికారులు కీలకపాత్ర పోషించాలని జిల్లా కలక్టర్ ఎం.విజయ సునీత స్పష్టం చేశారు. కలక్టరేట్ సమావేశం మందిరంలో పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం సెక్టోరల్ అధికారులకు ఎన్నికల ప్రక్రియపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈసందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు నిర్వహించవలసిన విధివిధానాలపై తగు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి ఎన్నికల సామగ్రి, ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల సిబ్బందిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేర్చవలసిన బాధ్యత సెక్టార్ అధికారులపైన ఉందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ అదనపు పోలీసు బలగాలను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, త్రాగు నీటి సదుపాయాలు సమకూర్చాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలుచేయలన్నారు. ఎన్నికల నిబంధన లను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. సెక్టోరల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యలు సృష్టించేవారిని ముందుగానే గుర్తించి నివేదించాలన్నారు. సెక్టోరల్ అధికారులకు మేజిస్టీ రియల్ వి.వి.పాట్‌లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు నిర్వహణపై అవగాహన కలిగి ఉండా లన్నారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ మార్చవలసివస్తే తప్పనిసరిగా మాక్ పోలింగ్ నిర్వహించాల్సిందేనని కలక్టర్ స్పష్టం చేసారు. పాడేరు రిటర్నింగ్ అధికారి భావన వశిష్ట్ మాట్లా డుతూ, రిసెప్షన్ కేంద్రం మార్గం ఇరుకుగా ఉన్నందున పోలింగ్ అనంతర సామగ్రిని ప్రవేశ ద్వారం వరకు తీసుకు వచ్చి వెంటనే సంబంధిత వాహనాన్ని పార్కింగ్‌ప్లేస్‌కు తరలించాలని, సామగ్రి తీసుకోవటా నికి ఏర్పాటుచేసిన కౌంటర్లలో దేనికి సంబంధించిన కౌంటర్లలో వాటిని అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఓ బి.పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలక్టర్లు వివిఎస్.శర్మ, పి.అంబేద్కర్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పాడేరు నియోజకవర్గ అభ్యర్థిత్వం వంతల సుబ్బారావుకే ఇవ్వాలి

విశాలాంధ్ర-చింతపల్లి : కాంగ్రెస్ పార్టీ పాడేరు నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిత్వం వంతల సుబ్బారావుకే కేటాయించాలని ఆ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ పాంగి రామకృష్ణ పివిటిజీ సామాజిక వర్గ జిల్లా కార్యదర్శి చిక్కుడు అశోక్, వంతల భాస్కరరావు, పాంగి శ్రీను లు అన్నారు. బలపం పంచాయితీ రాళ్లగెడ్డ కొత్తూరు గ్రామంలో శనివారం ఆపార్టీ నాయకులు, కార్యకర్తలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రమించినవారికి సముచిత స్థానం కల్పించాలన్నారు. కష్ట కాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం తో పాటు, పార్టీ శ్రేణులకు నేనున్నానంటూ భరోసా ఇచ్చిన నాయకుడు వంతల సుబ్బారావు అన్నారు. ఆయన నాయకత్వంలో పాడేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ముందుగా ప్రకటించిన స్థానం పాడేరు శాసనసభ నియోజకవర్గం అన్నారు. అటువంటి స్థానంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయనే వందనాలు ఈ మధ్యకాలంలో వినిపిస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరం పార్టీ కోసం పనిచేసిన సుబ్బారావును కాదని మరొకరి అభ్యర్థిత్వం పరిశీలిస్తున్నట్లు, తమ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్నట్లు పుకార్లు షికారులు చేస్తున్న తరుణంలో సమావేశం ఏర్పాటు చేసుకోవలసిన అవసరం వచ్చిందన్నారు. ప్రస్తుత ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి చింతపల్లి పర్యటనలో ప్రజలు, పార్టీ శ్రేణల సాక్షిగా పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. నేడు అభ్యర్థిత్వం తారుమారు కాబోతుందని వస్తున్న కథనాలతో ఆందోళన చెందుతున్న పార్టీ శ్రేణులకు భరోసా కల్పించవలసిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పై ఉందన్నారు. పాడేరు నియోజకవర్గ అభ్యర్థిగా వంతల సుబ్బారావు అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ఖరారుచేసి తమ సామాజిక వర్గానికి, అదేవిధంగా కష్టకాలంలో పార్టీని బలోపేతం చేసిన వారికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కేబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఐక్యాంపు

విశాలాంధ్ర-జి.మాడుగుల మండలం, రామాలయం వీధిలో కేబీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ లువ్వాబు రాజన్నదొర అధ్యక్షతన చైర్మన్ కొక్కుల కన్నబాబు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేబీ ఫౌండేషన్ చైర్మన్ కొక్కుల కన్నబాబు మాట్లాడుతూ కంటిచూపు సమస్య ఉన్న వారికి మారుమూల పల్లెల్లో పేద ప్రజలకు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. నిరుపేదలకు నిస్వార్థంగా వైద్యం అందించాలని నిశ్చయించుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేబీ ఫౌండేషన్ సెంట్రల్ కమిటీ సలహాదారులు తలారి జానకిరావు, మన్యం గాయకుడు దుద్దు సత్యనారాయణ, పాడేరు మండల కో ఆర్డినేటర్ యేసుబాబు, కొయ్యూరు మండల కో ఆర్డినేటర్ అర్జున్ రెడ్డి, కేబీ ఫౌండేషన్ జి మాడుగుల, పాడేరు, కొయ్యూరు మండల సిసి లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-పాలకొండ : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, ఆదేశాల మేరకు, దిశా డీఎస్పీ ఎస్.ఆర్.హర్షిత ఉత్తర్వులతో దిశా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ లావణ్య శనివారం పాలకొండలోని వివేకానంద పాఠశాలను సందర్శించి, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించి వారికీ పిల్లలపై జరిగే లైంగిక దాడి, వేదింపులును అరికట్టాలనే ఉద్దేశంతో భారత ప్రభుత్వం 2012లో పోక్సో చట్టాన్ని తీసుకొచ్చిందని దీనివల్ల 18 సం.లోపు పిల్లల మీద ఎవరైనా లైంగిక దాడి మరియు వేదింపులకు గురిచేస్తే ఈచట్టం ప్రకారం కటిన మైనశిక్షలు ఉంటాయని తెలియజేసారు. అదేవిధంగా వివేకానంద పాఠశాల ఉపాధ్యాయులతో కూడా సమావేశం ఏర్పాటు చేసి వారితో పిల్లలకు చెడు స్పర్శ,మంచి స్పర్శ గురించి అవగాహన కల్పించాలని, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్నా నేరాలు దృష్ట్యా వారికీ ఉపయోగపడే చట్టాలు తదితర అంశాల మీద అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యపట్ల మక్కువ చూపించాలని ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రులను గురువులను పూజించాలని ఈ సందర్భంగా అన్నారు.

ప్రశాంత, సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం

కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, సమర్థ వంతంగా నిర్వహించాలన్నదే లక్ష్యంగా అవసర మైన శిక్షణను అందించాలని కలెక్టర్ నిశాంత కుమార్ అన్నారు. ఇవిఎమ్ గోడౌన్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు సమర్థవంతంగా, పటిష్టంగా నిర్వహించేలా ప్రతీ నియోజక వర్గంలో ఈవిఎమ్, వివి ప్యాట్‌లపై శిక్షణ అందించనున్నామని అన్నారు. దీని కొరకు నియోజక వర్గ స్థాయిలో ఆరు ఈవిఎమ్‌ల చొప్పున అందించనున్నామని తెలిపారు. ఈవిఎమ్‌లపై ఎటువంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేసి ఎన్నికలు సాఫీగా జరిగే విధంగా చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈవిఎమ్‌ల శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు అందరూ సహకారం అందించాలని కోరారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

కంట్రోల్ రూమ్ పనితీరు పరిశీలన... కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ పనితీరు, నిఘాను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెబ్ కాస్టింగ్ ద్వారా ఆంధ్రా-ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ల వద్ద వాహనాల తనిఖీలను పరిశీలించారు. జి పి ఎస్ సిస్టం తో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల వాహనాలు ఉన్న ప్రదేశాల పర్యవేక్షణను, ప్రసార మాధ్యమాలు ద్వారా సోషల్ మీడియాలో ప్రసారమౌతున్న కార్యక్రమాల్లో యాడ్ వర్స్ వార్తలపై నిఘా, సి-విజిల్ ఫిర్యాదుల నమోదు, తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక,కంట్రోల్ రూం ఇన్ ఛార్జ్ అధికారి, ఎస్డిసి ఆర్ వి సూర్యనారాయణ, టిడిపి, లోక్ సత్తా, జె ఎస్ పి రాజకీయ పార్టీ ప్రతినిధిలు జి .వెంకట నాయుడు, కె.పాపారావు, పి.శ్రీనివాస్ రావు, ఇన్చార్జి డి అర్ ఓ జీ.కేశవ నాయుడు, తాసిల్దార్ కె.ఆనందరావు, డిప్యూటీ తాసిల్దార్ వెంకట రమణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వి.రామ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీకి నేడే ఆఖరు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : మున్సిపాలిటీలో ఆస్థి పన్ను, ఖాళీ స్థలం పన్నులు వడ్డీ లేకుండా కట్టేందుకు నేడే చివరి రోజని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. పన్ను చెల్లింపుదారులు వార్డు సచివాలయముల యందు గాని, ఆన్లైన్ ద్వారా లేదా మున్సిపల్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన ప్రత్యేక క్యాష్ కౌంటరు వద్ద పన్నులు చెల్లించాలని కోరారు. కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాష్ కౌంటరు తే.31.03.2024దీ అర్ధరాత్రి 12 గంటల వరకు పని చేయునని పురప్రజలు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు. కావున పన్ను చెల్లింపుదారులు సదరు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

వివాహం జరిగిన కొన్ని గంటల వ్యధిలోనే వధువు మృతి..!

విశాలాంధ్ర-మక్కువ : మక్కువ మండలంలో వివాహం జరిగిన కొన్ని గంటల వ్యధిలో వధువు అఖిల (20) మృతిచెందిన ఘటన దెబ్బగడ్డ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పార్వతీపురంకు చెందిన వెత్స అఖిలకు దెబ్బగడ్డ గ్రామంకు చెందిన భాస్కరరావుకు శుక్రవారం రాత్రి 10 గంటలకు వివాహం జరిగింది. వివాహ అనంతరం నిద్రించిన వధువు అపస్మారక స్థితిలో ఉండడంతో కుటుంబ సభ్యులు మక్కువ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సలు చేసిన వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కొరకు సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించామని సూచించారు. కుటుంబ సభ్యులు సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను తరలించగా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మార్గ మధ్యలోనే చనిపోయిందని తెలియజేశారు. పోస్టుమార్టం నివేదికలో మరణానికి గల కారణలు తెలియజేస్తా మన్నారు. ఇంట్లో శుభకార్యం జరిగిన కొన్నిగంటల్లోనే ఇలా జరగడంతో కుటుబసభ్యులలో విషాదం అలుముకుంది.

మీకే అవగాహన లేకపోతే విద్యార్థులకు ఏం బోధిస్తారు

ఉన్నత స్థాయి అధికారులపై రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : డిజిటల్ విద్యా బోధనపై ఉన్నత స్థాయి అధికారులకే అవగాహన లేకపోతే విద్యార్థులకు ఏవిధంగా పాఠ్యాంశాలను బోధించగలరని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మన్యం జిల్లాలో శనివారం పర్యటనలో భాగంగా గుమ్మలక్ష్మీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా తొమ్మిదవ తరగతికి వెళ్లి విద్యాబోధన ఏవిధంగా జరుగు తుంది, విద్యార్థులు ఏమేరకు మెరుగుపడ్డారు అనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బైజుస్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏవిధంగా బోధిస్తారో చూపించాలని డిఇఒ పగడాలమ్మకు, డిప్యూటీ డిఇఒలు, హెచ్ఎం బిడ్డిక భీముడును సూచించారు. ఇందుకు వారు డిజిటల్ బోర్డు వరకు వెళ్లి తెల్ల మొహం వేయడంతో అక్కడ ఉన్న వారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అనుభవం ఉన్న మీకే బోధనపై కనీస అవగాహన లేకపోతే ఎలా అని డిఇఒను ప్రశ్నించారు. నేను వస్తానని గత వారం రోజులుగా చెబుతున్న విద్యార్థులకు లెసన్ ప్లాన్లు రాయించకపోవడం ఏమిటని అన్నారు. ప్రిన్సిపాల్ సెక్రటరీ వస్తున్నారంటే ఏమైపోద్దిలే అనే ఒక రకమైన ఆలోచన మీలో ఉన్నట్టుగా కనిపిస్తుందని అన్నారు. నేనంటే అంత చిన్న చూపా అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూ.3000 కోట్లతో డిజిటల్ తరగతుల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తే వాటిపట్ల కనీసం అవగాహన లేకపోవడం విచారకరం అన్నారు. ఇదేనా మీరు రోజు చేస్తున్న బాధ్యతలేని ఉద్యోగం అంటూ మండిపడ్డారు. డిజిటల్ తరగతులు నిర్వహణపట్ల ఇటు జిల్లా స్థాయి అధికారులకు, అటు ఉపాధ్యాయులకు అవగాహన లేకపోవడంపట్ల చూస్తే ఎంత బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు ఇట్టే అర్థమవుతుందని అన్నారు. వచ్చేనెల నుంచి జరగనున్న ఎఫ్ఏ-4 పరీక్షలు ఎప్పుడు జరుగుతాయన్న ప్రశ్న కూడా సమాధానం ఇవ్వలేకపోవడంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షలకు సంబంధించి వాటిపై కూడా ఉపాధ్యాయులకు కనీస అవగాహన లేకపోతే ఎలాగని ప్రశ్నించారు. ఇక్కడ పదిమంది ఉపాధ్యాయులు మాత్రమే ఉండాల్సి ఉండగా 16 మంది ఉన్న విద్యా బోధన పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉపాధ్యాయుడు ఏదైనా ఒక పాఠ్యాంశాన్ని బోధించాలి అనుకుంటే దానిపై పూర్తిపట్టు సాధించి ఉన్న ఉండాలని అన్నారు. నేడు మనం డిజిటల్ యుగంలో ఉన్నామని విధులు పట్ల నిర్లక్ష్యం తగదు అన్నారు. ఐటిడిఏ పిఒ పర్యవేక్షణ లేకపోవడం కూడా విద్యకు అవంతరాలు ఏర్పడుతున్నాయని అన్నారు. వారానికి ఒక్కరోజైనా మీపరిధిలో ఏదైనా పాఠశాలను సందర్శించి విద్యార్థుల విద్య ప్రమాణాలను ఏ మేరకు మెరుగుపడ్డాయా గుర్తించారా అంటూ పిఒ విష్ణుచరణ్‌ను ప్రశ్నించారు. ఇలాగైతే విద్యా వ్యవస్థ పరిస్థితి ఏమిటి అని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సవరకోటపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. నాలుగు ఐదు తరగతుల విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించగా పూర్తిస్థాయిలో విద్యార్థులు నింపకపోవడంపై పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఇఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మన పిల్లలకైతే ఇలాగే చూస్తామా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం రూ.600 కోట్లతో డోర్స్, టేబుల్స్ ఇతర సామాగ్రి కొనుగోలు చేస్తే ఇంతవరకు పాఠశాలల్లో ఎందుకు ఏర్పాటు చేయలేదని అన్నారు. వీటిపై సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు కూడా దృష్టి సారించలేదు అన్నారు. ఎన్ని పాఠశాలలకు ఏర్పాటు చేశారని ప్రశ్నిస్తే సంబంధిత అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఏజెన్సీలో విద్యా విధానం మరి ఇంత నిర్లక్ష్యం తగదన్నారు.

మండిపోతున్న ఎండలు... నిర్మానుష్యమైన రహదారులు

విశాలాంధ్ర-పాచిపెంట: ఎండలు మండిపోవడంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి అనునిత్యం రద్దీగా ఉండే పాచిపెంట మెయిన్ రోడ్డు బైపాస్ రోడ్డు కూడలి కూడా నిర్మానుష్యంగా మారుతున్నాయి. వివిధ పనుల మీద దూర ప్రాంతాల నుండి వచ్చేవారు మండుతున్న ఎండలకు భయపడి పనులను వాయిదా వేసుకుంటున్నారు. మార్చి నెలలోనే ఎండలు ఇలా ఉంటే రాబోయే రోజులను తలంచుకొని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన పాచిపెంటతో పాటు వేటగాని వలస నందేడివలస గిరిజన గ్రామాలలో నిర్వహించే వారపు సంతల కూడా వేలవేల పోతున్నాయి. ఎన్నో ప్రయాసలకు ఓర్చి దూర ప్రాంతాల నుండి వారపు సంతలకు సరుకులు తీసుకువచ్చే వ్యాపారులు బేరాలు లేకపోవడంతో ఉసూరు మంటూ వెనదురగుతున్నారు. ఈ ప్రాంతము కొండలకు దగ్గరలో ఉండటంతో ఎండలతో పాటు వడగాలులు వీచడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వాడగాలులకు రాత్రి సమయాలలో కూడా ఒక్క పాతతో ఇబ్బందులు పడుతున్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి



విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలం కాశీపట్నం పంచాయతీ కార్యదర్శి మురళి 2,600 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సాల్వెన్సీ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేయగా పంచాయతీ కార్యదర్శి లంచం డిమాండ్ చేశారు. ఈమేరకు బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. లంచం ఇస్తుండగా అధికారులు పంచాయతీ కార్యదర్శిని, లంచం డబ్బులతో పాటు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

సీనియర్ సిటిజన్, వికలాంగుల పోస్టల్ బ్యాలెట్ల కోసం బిఎల్వోల ద్వారా సేకరించాలి

టీడీపీ మండల కన్వీనర్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారులకు వినతి

విశాలాంధ్ర-కురుపాం : సీనియర్ సిటిజన్, వికలాంగుల ఓటర్లు వద్ద నుండి పోస్టల్ బ్యాలెట్లు కోసం ఫారం 12 ను బూత్ లెవిల్ అధికారుల ద్వారా సేకరించాలని కురుపాం, కొమరాడ టీడీపీ మండల కన్వీనర్లు కె.వి.కొండయ్య, శేఖర్ పాత్రుడు నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నిక అధికారి బి.ఎస్.ఎస్ సత్యనారయణకు వినతిపత్రం అందజేసారు. గ్రామాలలో వాలంటీర్లు వెళ్ళి 12డిలను సేరిస్తున్నారని దీనివలన సీనియర్ సిటిజన్, వికలాంగుల ఓటర్లను ప్రభావితం చేసే అవకాశంఉందని అసిస్టెంట్ ఎన్నిక అధికారి వివరించారు. ఈ విషయం అధికారులు దృష్టికి తీసుకు వెళ్తామని అసిస్టెంట్ ఎన్నిక అధికారి అన్నారు.

మాక్ పోలింగ్‌పై శిక్షణ

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత శనివారం రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈవిఎంలపై, మాక్ పోలింగ్ పై ట్రైనింగ్ కార్యక్రమంలో పిఓ మరియు ఎపిఓలకు వివిధ సూచనలు ఇచ్చారు. ఈ కార్యమానికి పార్వతీపురం తహసిల్దార్ కె.ఆనందరావు హాజరయ్యి వివిధ సూచనలు ఇచ్చారు.

పన్నుల వసూళ్లలో రెవెన్యూ సిబ్బంది

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్: మార్చి నెల ముగుస్తున్న తరుణంలో మున్సిపాలిటీలో పేరుకుపోయిన ఆస్తి పన్ను ఖాళీ స్థలాల పన్నుల వసూళ్ల మున్సిపల్ రెవెన్యూ విభాగ సిబ్బంది ముమ్మరం చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 31వ తేదీ లోగా ఆస్తి పన్ను ఖాళీ స్థలాల పన్నులు చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ మాఫీ ఇస్తుందన్న విషయాన్ని పట్టణ ప్రజలకు తెలియజేస్తూ పన్నుల వసూల్లను సిబ్బంది చేస్తున్నారు.శనివారం మున్సిపాలిటీలోని ఇందుపూరి జ్యువెలర్స్ తో పాటు పలు వాణిజ్య సంస్థలు మున్సిపాలిటీకి బకాయిపడ్డ పన్నులను ఆ వ్యాపార యజమానులు కమీషనర్ కె శ్రీనివాస్ కు నగదు రూపంలో, చెక్కుల రూపంలో అందజేశారు.వడ్డీ రాయితీతో ఆదివారం అర్ధరాత్రి వరకు పట్టణ ప్రజలు పన్నులు చెల్లించవచ్చని కమిషన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు నారాయణరావు వినయ్ రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపి ఆధ్వర్యంలో అగ్ని బాధిత కుటుంబాలకు సాయం

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మల్లేతోట గ్రామంలో గురువారం 5 ఐదిళ్లు అగ్ని ప్రమాదానికి గురయ్యి, ఏడు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. వారికి మండల బిజెపి అధ్యక్షులు డివిఎస్ఎస్ రమణారెడ్డి (చిట్టిబాబు) శనివారం ప్రతి కుటుంబానికి బిందెలు, ప్లేట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మీడియం కన్నారావు, సవలం వీర్రాజు, కట్టబోయిన కృష్ణ, జోగయ్య, మల్లయ్య బుచ్చిరాజు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు కూడిన ఓటింగ్‌పై అవగాహనా కార్యక్రమం

విశాలాంధ్ర-మారేడుమిల్లి : అల్లూరి సీతారామజు జిల్లా మారేడుమిల్లి మండలం లో మండల స్థాయి అధికారులు తోశనివారం తహసీల్దార్ వి.వెంకటరమణ ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుండి మనవహారం గా ప్రధాన సెంటర్లో నీ ఓటు మన దేశ అభివృద్ధి, ఒక్క ఓటు మన భవిష్యత్తు మారుస్తుంది, నీ ఓటు నీ భవిష్యత్తు, మీ ఓటుతో మీరేనిర్దేశించండి అనే నినాదాలు తో ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి పౌరుదునైతిక విలువలు కూడిన ఓటు హక్కు వినియోగించు కోవాలని, ఓటర్లను చైతన్య పరుస్తూ, ఓటర్ల ను భాగస్వామ్యం చేస్తూ, ఫారం 6, పారం 6ఎ,పారం 6బి, పారం 7, పారం 8, గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.వెంకటరమణ, ఎంపిడిఓ ఏ.వెంకటరమణ, ఎస్ఐ రాము, ఎంఈఓ తమ్మారావు, హౌసింగ్ జె ఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఎమ్మెల్యే సీటు అవసరమే కదా

పాడేరు టిక్కెట్ కేటాయింపుపై కన్నీరు పెట్టుకున్న ఈశ్వరి

విశాలాంధ్ర-పాడేరు: ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీకి ఒక్క ఎమ్మెల్యే కూడా అవసరమేనని, పాడేరు టిడిపి అభ్యర్థి కేటాయింపుపై అధిష్టానం పునరాలోచించాలని మాజీ ఎమ్మెల్యే, పాడేరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి కన్నీళ్లతో వేడుకున్నారు. శనివారం ఐదు మండలాల పార్టీ శ్రేణులతో పాడేరులో గిడ్డి ఈశ్వరి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 2017 నుండి పార్టీ కోసం కష్టపడితే ఏ సర్వే ప్రకారం తనను కాదని రమేష్ నాయుడుకి టికెట్ కేటాయించారో చంద్రబాబు, లోకేష్ సమాధానం చెప్పాలని కన్నీరు పెట్టుకున్నారు. తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం లేని రమేష్‌నాయుడు లాబింగ్ చేసి టికెట్ పొందారని ఆరోపించారు. అధిష్టానం పునరాలోచన చేసి పాడేరు టికెట్ తనకు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి డిమాండ్ చేశారు. పునరాలోచన చేయకుంటే రమేష్ నాయుడును ఖచ్చితంగా ఓడించి తీరుతామని గిడ్డి ఈశ్వరి హెచ్చరించారు.

రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ

విశాలాంధ్ర-దేవీపట్నం : జీసస్ క్రీస్తును శిలువ వేసిన దినం శుభ శుక్రవారంను పురస్కరించుకొని గోకవరం మండలం లోని గోకవరం పంచాయతీ కార్యాలయం డ్రైవర్స్ కోలనీ వరకు అదేవిధంగా దేవీపట్నం మండలంలో ఇందుకూరు చుట్టు పక్కల తొమ్మిది గ్రామాలలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అగాఫే పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ గునిపే పీటర్ సన్ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. యేసుక్రీస్తు ప్రభువు వారి త్యాగంను అయన సిలువలో మరణము మరియు ఆయన పునరుత్థానము గూర్చి ప్రకటించి పాటలతోను ప్లకార్డులతోను ఫ్లెక్సీలు తోను యేసుక్రీస్తు ప్రభువును స్తుతించిచు క్రైస్తవ సోదరులు బారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోఆర్డినేటర్ టీమ్ గునిపే ఏడుకొండలు నేమాల కృష్ణంరాజు ఎమ్. వినాయకరావు వి.విజయనరేంద్ర ఎస్.సునీల్ కుమార్, వి. సురేష్ కె.అరుణ్‌కుమార్ ఇందుకూరు, గోకవరం సంజీవయ్య నగర్ సంఘం సభ్యులు అందరూ పాల్గొన్నారు.

యేసు మరణం సర్వమానవాళి రక్షణ కోసమే

విశాలాంధ్ర-బెలగాం : యేసు మరణం సర్వమానవాళి రక్షణ కోసమేనని విశాఖ సెనెడ్ బిషప్ సుదర్శన్ అన్నారు. శనివారం ఈస్టర్ పర్వదిన ఉత్సవాల్లో భాగంగా పట్టణ పాస్టర్లు, యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యేసు మరణాన్ని గెలిచి ప్రజలను కాపాడేందుకు వచ్చారన్నారు. సర్వమానవాళి ఐక్యమత్యమే యేసు అభిష్టమన్నారు. ప్రతి ఒక్క క్రైస్తవుడు తోటి వారితో మంచిగా ఉంటూ స్నేహభావాన్ని అలవరుచుకోవాలని అన్నారు. మానవాళిని రక్షించడానికి వచ్చిన యేసుకు మనమంతా రుణపడి ఉంటామన్నారు. అనంతరం రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్, నాలుగు రోడ్ల కూడలి, పాత బస్టాండ్ కూడళ్ల వద్ద పట్టణ ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిషప్ తిమోతీ, పాస్టర్లు సూర్యప్రకాష్, విజయ్ కుమార్, గోపి, సుధీర్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుంచి శ్రీశ్రీదారాలమ్మ తల్లి అమ్మవారి 58వ జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర-సీలేరు... అంతరాష్ట్ర ఆరాధ్య దైవం దారకొండ శ్రీశ్రీ దారాలమ్మ తల్లి అమ్మవారి 58వ జాతర మహోత్సవాలు ఏప్రిల్ 1 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1 సోమవారం ఉదయం 7.54 నిమిషాలకు ముహూర్తపు రాట అదే రోజు ఉదయం 9.22 నిమిషాలకు గరగల అలంకరణ చేయబడునని తెలిపారు. ఏప్రిల్ 9 పట్టా నివేదికతో జాతర మహోత్సవాలు ముగుస్తాయన్నారు. 8వ తేదీన ఆదివారం ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు చిన్నజాగరణ, అలాగే 9వ తేదీ ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పెద్ద జాగరణ నిర్వహిస్తున్నామని చెప్పారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు అమ్మవారి గర్భాలయం 7.15 నిమిషాలకు తిరిగి అమ్మవారి గర్భాలం తలుపులు తెరిచి యధావిధిగా అమ్మవారి పూజలు కొనసాగిస్తామన్నారు. అలాగే పండుగ ఐదు రోజులు చింతపల్లి మండలం పెంట్లి మామిడి గ్రామానికి చెందిన వంతల గోపినాథ్, అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఉచిత అన్నసమారాధన ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. అలాగే ఐదు రోజుల పాటు భజనలు, కోలాటాలు, థీంసా, పలు అధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి భక్తులు ఈజాతరకు వచ్చి అమ్మవారి ప్రసాదాలు స్వీకరించి తరించాలని ఈవో కోరారు.

శివ్వాంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంకి స్పందన

తనిఖీలు నిర్వహించిన వైద్యాధికారి డాక్టర్ కె కె సాగర్ వర్మ

విశాలాంధ్ర-గరుగుబిల్లి : మండల పరిధిలోని శివ్వాం గ్రామంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం కు మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంను గరుగుబిల్లి వైద్యాధికారి డాక్టర్ కెకె సాగర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈవైద్య శిబిరములో వైద్యాధికారులు గ్రామం నుంచి హాజరైన పలువురి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్న అనంతరం అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అదేవిధంగా గర్భిణీలకు హిమోగ్లోబిన్, బి.పి, షుగర్, టెస్టులు చేసి రక్తం తక్కువగా ఉన్న వారికి ఐరన్ టాబ్లెట్ ఇస్తూ ఆహారంలో తగు జాగ్రతలు తీసుకోవాలని, హిమోగ్లోబిన్ పెరిగినంత వరకూ పర్యవేక్షణ చెయ్యాలని వైద్యాధికారి డాక్టర్ సాగర్‌వర్మ సూచించారు. దీర్ఘకాలిక రోగాలు, బాలింతలు, చిన్న పిల్లలకు అవస రమైన వైద్యపరీక్షలు, నిర్వహించ దంతోపాటు మందులను అంద జేశారు. అలాగే ఆర్ బి ఎస్ కె అధికారి డాక్టర్ రఘు, డాక్టర్ పల్ల శ్రీధర్‌లు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరమును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు, సూపర్వైజర్ బిడ్డిక చిన్నమ్మి, రవణమ్మ, చింతాడ ఉదయకుమారి, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గా ప్రసాద్, శివ, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు టీడీపీ టికెట్ కేటాయింపు సరికాదు

టీడీపీ సీనియర్ నేతలు అత్యవసర సమావేశం

విశాలాంధ్ర-పాడేరు : తెలుగుదేశం పార్టీ అధిష్టానం పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికపై పునరాలోచించాలని పార్టీ సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాడేరులో తెదేపా సీనియర్ నాయకులు మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, ఎంవీఎస్ ప్రసాద్. కొట్టగుల్లి సుబ్బారావు. వంజంగి కాంతమ్మ, బొర్రా నాగరాజు విజయరాణి తదితరులు మీడియా సమావేశం అధిష్టానంపై విమర్శలు గుప్పించారు. కనీసం పార్టీలో అర్హత లేని వ్యక్తికి టికెట్ ఎలా కేటాయిస్తారని, రమేష్ నాయుడు తెదేపా పార్టీలోకి వచ్చి మూడు నెలలు అయిందని, రమేష్ నాయుడు దగ్గర భారీగా ముడుపులు తీసుకుని టికెట్ కేటాయించారని ఆరోపించారు. పార్టీ పునరాలోచన చేసి టికెట్ కేటాయించాలని డిమాండ్ తెదేపా పార్టీ డబ్బులు ఆశించే టికెట్లు కేటాయిస్తుంది. కనీసం పాడేరు నియోజకవర్గంలో ఎన్ని పంచాయితీలు ఎన్ని బూత్ కమిటీలు ఉన్నాయో తెలియని వ్యక్తికి టికెట్ కేటాయించడం సర్పంచ్ ఎన్నికల్లోనే నాలుగో స్థానం వచ్చిన వ్యక్తి ఎమ్మెల్యేగా గెలుస్తారా బాబుకి తప్పుడు నివేదిక సమర్పించి టికెట్టు పొందారు. బీఫామ్ ఇచ్చేంతవరకు మా ప్రయత్నాలు మేం చేసుకుంటాం అంటూ పాడేరు నియోజకవర్గ సీనియర్ నాయకులు స్పష్టం చేసారు.

రమేష్ అభ్యర్థిత్వం వలన పార్టీకి నష్టం జరగబోతుంది

తెదేపా మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, లక్ష్మణ్

విశాలాంధ్ర-చింతపల్లి: పాడేరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ప్రకటన విషయంలో నేటివరకు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు, కనీసం నియోజకవర్గంలోని ఆపార్టీ మండల అధ్యక్షులకు తెలియని వ్యక్తి వెంకట రమేష్‌నాయుడు, అభ్యర్థిత్వం ఖరారు చేయడం వలన పార్టీకి నష్టం జరగబోతుందని, అభ్యర్థి విషయంలో పునరాలోచన చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం చింతపల్లిలో ఆపార్టీ మండల ఉపాధ్యక్షుడు అంధ్రాబు లక్ష్మణ్ తో కలసి ఆయన మాట్లాడుతూ తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న గిడ్డి ఈశ్వరి గడచిన ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ తెదేపా బలోపేతానికి అహర్నిశలు శ్రమించారన్నారు. తెలుగుదేశం పార్టీ తలపెట్టిన ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడమే గాక, పార్టీ బలోపేతానికి ఆమె చేసిన కృషి ఎనలేనిదన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమేగాక, టిక్కెట్టు కేటాయిస్తే దాదాపు విజయం ఖాయం అన్న తరుణంలో ఏనాడూ పార్టీ కోసం పనిచేయని, నాయకులు కార్యకర్తలకు కనిపించని వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడం విస్మయానికి గురిచేసిందన్నారు. పార్టీ బలోపేతం కోసం, పార్టీ తలపెట్టిన కార్య క్రమాల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకుని పార్టీయే శ్వాసగా పనిచేసిన గిడ్డి ఈశ్వరిని కాదని కనీసం ఆపార్టీ ఐదు మండలాల అధ్యక్షులకు కూడా తెలియని వారిని అభ్యర్థి అనడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఐదేళ్ల తాము పడిన శ్రమను వృధా చేసేవిధంగా అధిష్టానం నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమన్నారు. విజయం సాధించే సత్తా ఉన్న గిడ్డి ఈశ్వరికే పాడేరు నియోజకవర్గం అభ్యర్థిత్వం ఖరారు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రంథాలయ సంస్థకు సెస్ బకాయిలు అందజేత

గ్రంథాలయ నిర్వాహకులు మధు సూధనరావుకు చలనాలు అందజేసిన ఇఓపిఆర్‌డి

విశాలాంధ్ర-గరుగుబిల్లి : గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన 8% గ్రంథాలయ పన్నును పలు గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు శనివారం గ్రంథాలయ నిర్వహణ అధికారి నల్ల మధుసూదనరావుకు చలానాలను అందజేశారు. ఈమేరకు మండల ఈఓపిఆర్‌డిఎల్ గోపాలరావు ఆధ్వర్యంలో గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్ బకాయిలకు సంబంధించిన చలానాలను అందజేశారు. ఉమ్మడి జిల్లాల జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోసెల లక్ష్మి ఆదేశాలు మేరకు గరుగుబిల్లి శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన గ్రంథాలయ పన్ను విషయమై ఎంపీడీవో పైల సూర్యనారాయణకు గడిచిన కొద్దిరోజుల క్రితం తెలియజేశారు. ఈమేరకు ఉల్లిభద్ర, తోటపల్లి, పెదగుడబ, రావివలస, సంతోషపురం, గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన చలానాలను అందజేశారు. అదేవిధంగా మిగిలిన గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన పన్నును తక్షణమే చెల్లించాలని ఎంపీడీవో సూర్యనారాయణ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఈ సమావేశంలో మండల ఈఓపిఆర్‌డిఎల్ గోపాలరావు, గ్రంథాలయ సంస్థ నిర్వాహ కులు నల్ల మధుసూదనరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉప్పల పెదకోటేశ్వరరావు, తిరుపతి భాస్కరరావు, బలగ వెంకట సాయికృష్ణ, సూరు శ్రీనివాసరావు, రంభ శశిభూషణ రావు, బంటు అప్పారావు, అల్లు రమేష్, రేవళ్ల చరణ్ పండిట్, అద్దూరి లలితకుమారి, బిడ్డిక సుభద్ర, దువ్వ సంధ్య, దత్తి సురేష్ కుమార్, డి దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అరకులో భాజపా పార్టీ సమీక్షా సమావేశం

విశాలాంధ్ర-అరకులోయ : అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు అరకులోయ అసెంబ్లీ కన్వీనర్ బిసోయి ధర్మరాజు ఆధ్వర్యంలో పద్మాపురం లోగల వి రిసార్ట్స్ లో నియోజకవర్గ స్థాయి నాయకులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. అరకులోయ అసెంబ్లీ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులు మరియు గ్రామ బూత్ కమిటీ నాయకులతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రచారం కోసం పక్క ప్రణాళికతో ప్రజల ముందుకు వెళ్ళుటకు కార్య చరణం రూపొందించి కొనసాగేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ధర్మరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ బలపరిచిన అరకులోయ అసెంబ్లీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి.రాజరావు పాల్గొనీ మాట్లాడారు. త్వరలో జరగనున్న అరకులో అసెంబ్లీ పార్లమెంటు స్థానాన్ని భారతీయ జనతా పార్టీ కైవాసం చేసుకుని మన్య ప్రాంతంలో బీజేపీ పట్టును కేంద్ర పార్టీ ఆది నాయకత్వానికి గిఫ్ట్‌గా ఇవ్వాలన్నదే ముందున్న ఆశయమని ఆయన పేర్కొన్నారు. అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గంలో భాజపా పటిష్టంగా ఉండడం వలన తెలుగుదేశం జనసేన భాజాపాకు అరకులోయ అసెంబ్లీ సీటు కేటాయించిందన్నారు. సర్వేలో భాగంగానే అరకులోయ అసెంబ్లీకు సర్వేల భాగంగానే అరకు అసెంబ్లీ ,పార్లమెంట్ కేటాయించిన విషయాన్ని రాజారావు తెలిపారు. అంతే కాకుండా ఎన్డీఏ బిజెపి ప్రభుత్వం ఆదివాసులకు ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహనపరిచి రాష్ట్రంలో ఎన్డీఏ ఉమ్మడి ప్రభుత్వం అలాగే కేంద్రంలో ఎన్డీఏ బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చేందుకు కార్యకర్తలు అభిమానులు తమ అమూల్యమైన ఓటు బీజేపీ కమలం గుర్తుపై వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి మట్టం శాంతి కుమారి, అరకు అసెంబ్లీ కో -కన్వీనర్ శెట్టి రాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు మూర్తి, జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షులు సత్యవతి, యువ మోర్చా అధ్యక్షుడు కొండబాబు, కిషన్ మోర్చా అధ్యక్షుడు దేవదాస్, అరకు బిజెపి మండల అధ్యక్షుడు స్వామి రామచందర్, తమ్మన, గాసన్న, రాజయ్య సుమారు 500 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండల అప్రమత్తంగా ఉండాలి

రావివలస వైద్యాధికారి డాక్టర్ కె.కార్తీక్

విశాలాంధ్ర-గరుగుబిల్లి : ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడంతో వడదెబ్బకు గురికాకుండా ఉండేలా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని మండల పరిధిలోని రావివలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.కార్తీక్ వెల్లడించారు. ఈమేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా ఆరు బయట పనిచేసేవారు ఏదైనా పనినిమిత్తం బయటకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తరచూ నీళ్లు తాగడంతో పాటు డిహైడ్రేషన్ తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా బయటకు వెళ్లేవారు తెలుపు లేతరంగుల పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలన్నారు. అదేవిధంగా తలపై టోపీ పెట్టుకోవాలని లేదా రుమాలు చుట్టు కోవాల్సి ఉందన్నారు. నీళ్లు, నిమ్మరసం ,కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్, వంటివి తాగాలని తెలిపారు. ఎండలో పనిచేసేవారు ఇబ్బందిగా అనిపిస్తే తక్షణమే చల్లని ప్రదేశంలో సేద తీరాలన్నారు. అధిక వేడివల్ల ఆహారం త్వరగా పాడవుతుందని అటువంటివి తింటే డయేరియాకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, మధ్యాహ్నం పూట బయటకు వెళ్లొద్దని వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ సూచించారు.

ఘనంగా శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రాణ ప్రతిష్ట

విశాలాంధ్ర-అనంతగిరి.. అల్లూరి, విజయనగరం జిల్లాల సరిహద్దు గ్రామమైన ఎగువ కొండపర్తి లో శ్రీ వేంకటేశ్వరుని ఆలయ నిర్మాణం చేపట్టి ఘనంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతోంది. ఆలయ ధర్మకర్త కర్రీ సముద్రరెడ్డి అందించిన వివారాలు ప్రకారం తెలుగు ప్రజలు ఆరాధ్య దైవంగా భావించే తిరుమల తిరుపతి లలో వెలసిన శ్రీ వెంకటేశ్వర ఆలయ స్ఫూర్తితో ఈ ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు ఈ ఆలయానికి అనంత వెంకటేశ్వర ఆలయంగా నామకరణం చేశామని తెలిపారు అలాగే సముద్రమట్టానికి 3333 అడుగుల ఎత్తులో ఈ వెంకటేశ్వర ఆలయం నిర్మించామని తెలిపారు ప్రధాన రహదారి నుంచి 18 మలుపులు కలిగిన ఈ ప్రాంతం వెంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతిపాదికంగా ఉంటుందని నిర్మాణం చేపట్టాలని తెలిపారు ఈ అనంత వెంకటేశ్వర దేవాలయంలో పద్మావతి గోదాదేవి వరాహ దయ స్వామి గరుడల్వార్ సంకల్ప సిద్ధి మహా గణపతి ఆంజనేయస్వామి మండపం ఉత్సవమూర్తుల కళ్యాణమండపం వంటివి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు కేవలం గుడి నిర్మాణం కాకుండా పుణ్యక్షేత్రంగా భవిష్యత్తులో రూపొందించాలని కేశఖండన భోజనశాల గోశాల కళ్యాణ మండపం ధర్మసత్రాలు వంటివి కూడా ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఈ ప్రాంతం మంచి ఆధ్యాత్మిక ప్రాంతంగా చేయిదలుచుకున్నామని ఆయన తెలిపారు ఈనెల 30 నుంచి మూడు రోజులపాటు ఘనంగా పూజలు నిర్వహించి మూడో తేదీన వేదపండితుల సమక్షంలో ఆలయంలో విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని తెలిపారు మూడో తేదీ జరిగే విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేద పండితులు ప్రముఖులు అనేకమంది వస్తున్నట్లు తెలిపారు కావున అవకాశం ఉన్న భక్తులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి నూతనంగా వేలుస్తున్న అనంత వెంకటేశ్వర స్వామిఆలయానికి విచ్చేసి అనుగ్రహం పొందాలని కోరారు.

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు 12డి ఫారం



విశాలాంధ్ర-పార్వతీపురం : దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు ఇంటి వద్ద ఓటింగ్ సౌకర్యం కోసం ఫారం 12 డి ను సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక అన్నారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల ఓటింగ్ అంశంపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఎన్నికల సంఘం ఓటర్లందరినీ బయటకు వచ్చి సంబంధిత పోలింగ్ ఓటు వేయమని ప్రోత్సహిస్తుందన్నారు. ఓటు వేయలేని శారీరక వైకల్యం లేదా వయస్సు పైబడిన ఓటర్లు సైతం ఓటు హక్కు వినియోగించు కోవాలని భావించడం జరిగిందన్నారు. ఈ సౌకర్యం వినియోగించుకొనుటకు దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు అర్హులని అన్నారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ ఓటర్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 సెక్షన్ 2 కింద సంబంధిత అధికారి ధృవీకరించిన దివ్యాంగుల సర్టిఫికేట్ (కనీసం 40 శాతం వైకల్యం కలిగి ఉండాలి) కలిగి ఉండాలని, ఫారం 12డిని దరఖాస్తుతో పాటు దివ్యాంగుల అంగవైకల్య ధృవీకరణ పత్రం కాపీని జతచేయాలని వివరించారు. సీనియర్ సిటిజన్లు - 85 ఏళ్లు దాటిన ఓటర్లు ఓటర్ జాబితా వివరాల్లో వయస్సు కలిగి, ఓటరు ఫారం 12డి ని సమర్పించాలని స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారి ధృవీకరించిన, అర్హులైన ఓటర్ల ఇళ్లను బిఎల్‌ఓ సందర్శిస్తారని ఆమె చెప్పారు. నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లోగా ఓటరు నుండి ఫారం- 12డి ని బిఎల్‌ఓ సేకరించి రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారని అన్నారు. ఫారం- 12డిలో సరైన వివరాలు ఉన్న ఓటర్లందరికీ పోస్టల్ బ్యాలెట్ పేపర్ జారీ చేస్తారని, సూక్ష్మ పరిశీలకులతో పాటు పోలింగ్ అధికారుల బృందం ఫారం- 12డి దరఖాస్తులో పేర్కొన్న చిరునామా వద్ద ఓటర్లను సందర్శిస్తుందన్నారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె ఆదేశించారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల గుర్తింపులో పక్కాగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి. కేశవనాయుడు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల శాఖ సహాయ సంచాలకులు కె. కవిత, జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి మరియు నోడల్ అధికారి కె. శ్రీనివాసరావు, పర్యవేక్షకులు చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రణాళికాయుతంగా వ్యవహరించాలి

నోడల్ అధికారులతో సమావేశంలో డీఆర్వో పద్మావతి

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ నిర్వహణను సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు తగిన ప్రణాళికలు రచించుకొని ముందుకు సాగాలని సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి ఎన్నికల మోడల్ అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ నోడల్ అధికారులతో శనివారం ఉదయం డిఆర్ఓ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఆయా నోడల్ అధికారుల సమక్షంలో ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్లు, తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ మేన్ పవర్ మేనేజ్మెంట్, మెటీరియల్ మేనేజ్మెంట్, ఈవీఎంల మేనేజ్మెంట్ తదితర ప్రక్రియల్లో చురుగ్గా ఉండాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమావేశంలో ఎస్డిసి వివిఎస్ శర్మ, నోడల్ అధికారులు ఎం.శివయ్య, పి గోవింద రాజులు, పి రాములు, వెంకటరావు, ఎం.అప్పారావు, వివిధ విభాగాల నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

కెజిబివిలో డిజిటల్ భోధనపై విద్యాశాఖ కార్యదర్శి సంతృప్తి

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తన పర్యటనలో భాగంగా స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయంను సందర్శించిన ఆయన విద్యార్థినులు తో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఏవిధంగా వినియోగిస్తున్నారో ప్రిన్సిపాల్ శ్రీరంజనిని అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ బోధన ఏవిధంగా చేస్తున్నారో పరిశీలించారు. విద్యార్థులు ట్యాబ్‌లలో నేర్చుకుంటున్న అంశాలు తెలుసుకుని సంత్రుప్తి వ్యక్తం చేశారు.ఐటిడిఎ పిఓ విష్ణు చరణ్, మాన్యం జిల్లా విద్యాశాఖ అధికారులు, పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కు నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు.

మావోల కరపత్రాల కలకలం

విశాలాంధ్ర-ఎటపాక : సీపీఐ మావోయిస్ట్ పార్టీ బికె - ఏయస్సార్ డివిజన్ కమిటీ పేరుతో అల్లూరి సీతారామ రాజు జిల్లా యటపాక మండలం కన్నాయగూడెం గ్రామం చివర జాతీయ రహదారిపై వెలసిన కర పత్రాలు కలకలం సృష్టించాయి. ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ప్రత్యక్షమైన ఈ కరపత్రాలలో ఆదివాసీలను విస్తాపన చేసే దేశి, విదేశీ బహుళజాతి కంపెనీల మైనింగ్స్, ప్లాంట్లు, రోడ్లు, డ్యాంలు, టైగర్ జోన్ లు, అభయారణ్యాల వంటి ప్రాజెక్టను నిలిపివేయాలని, ఆదివాసీల స్వయం ప్రతిపత్తికి, చట్టాలకు భంగం కల్గించే కార్పొరేట్ సెక్యూరిటీ పోలీస్ క్యాంప్ లను, ఉద్యమాలను అణచి వేసే పారా మిలటరీ, స్పెషల్ బలగాలను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కాగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్, సీఆర్పీఎఫ్ బలగాలతో ముమ్మర తనిఖీ లు జరుపుతూ బందోబస్తు నిర్వహిస్తున్న వేళ ఈ కరపత్రాలు ఒక పక్క పోలీస్ శాఖకు సవాల్ విసురు తుండగా, మరో పక్క కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.